ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జయశంకర్ భూపాలపల్లి ములుగు

5

మంగళవారం 5 నవంబరు 2024



- పథకం అమలుకు షెడ్యూల్ ఖరారుతో చిగురించిన ఆశలు
- 15వ తేదీ నుంచి గ్రామ సభలు.. 20వ తేదీలోపు లబ్ధిదారుల గుర్తింపు
- వివరాల నమోదుకు ప్రత్యేక యాప్
- ప్రక్రియలో ఎమ్మెల్యేలు, ఇందిరమ్మ కమిటీలకు ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో 2.88లక్షల దరఖాస్తుదారులు

'ఇందిరమ్మ' దరఖాస్తుదారుల్లో.. ఆనందం

హనుమకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. త్వరలో తమ సొంతింటి కల నెరవేరబోతోందంటూ వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సొంత స్థలం ఉండి ఇప్పటి వరకు ఇల్లు నిర్మించుకోలేకపోయిన వారికి ఈ ఇందిరమ్మ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఈ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరించింది. అర్హులైన వారిని ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. కానీ తొమ్మిది నెలలుగా దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశారు. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన ప్రకటన, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక షెడ్యూల్ ప్రకటనతో అందరిలోనూ ఆనందం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో ఈనెల 15 నుంచి 20వ తేదీ మధ్య గ్రామ సభలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తించి జాబితాలు ఖరారు చేయనున్నారు. మొత్తం 15 రోజుల్లోనే గ్రామ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి జాబితా విడుదల చేయనున్నారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొందిన వారికి ఈ సారి కేటాయింపులు ఉండవని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొదటి విడతలో సొంత స్థలం ఉన్నవారికి, రెండో విడతలో స్థలం లేనివారికి స్థలం ఇచ్చి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేయనున్నారు.

42 వేల మందికి అవకాశం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇళ్లు లేనివారి సంఖ్య లక్షల్లోనే ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టింది. ఆ ప్రభుత్వం ఆధ్వర్యంలో

మిగతా 6లో...

ఇందిరమ్మ ఇళ్లకు యాప్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటికే ఒక యాప్ డిజైన్ చేశారు. గ్రామ సభల్లో పేదలను ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఈయాప్‌లో పొందు పరుస్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించినట్టు సమాచారం.

మార్గదర్శకాలివీ..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దీని ప్రకారం మహిళల పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి ఇందులో దరఖాస్తుదారు పేరు ఉండాలి. దరఖాస్తుదారు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అనర్హురాలిగా ప్రకటిస్తారు. దరఖాస్తుదారుల్లో దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ మైనారిటీలకు 50 శాతం, జనరల్ కోటా కింద 15 శాతం కేటాయిస్తారు. గతంలో ఇళ్లు మంజూరైన, దళిత బంధు పథకం పొందిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. సొంత స్థలం కనీసం ఒక గుంట భూమి పట్టా ఉండాలి. మంజూరు పత్రాలు అందిన తర్వాత నిర్మాణం ప్రారంభించవచ్చు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుంది. నాలుగు దశల్లో డబ్బును విడుదల చేస్తారు. పునాది స్థాయిలో రూ.లక్ష, రెండో దశలో రూ.1.25 లక్షలు, మూడో దశలో స్లాబ్‌కు రూ.1.75లక్షలు, ఫినిషింగ్ దశలో ఇంకో రూ.లక్ష ఇస్తారు.

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ప్రకారం..	జిల్లా	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	ములుగు	జయశంకర్ భూపాలపల్లి
	మొత్తం దరఖాస్తులు	74,000	75,000	40,000	52,000	22,000	25,000
	స్థలం ఉన్న వారు	14,800	15,000	8,000	10,400	4,400	5,000

సింగరేణి అభివృద్ధికి కృషి చేస్తా

- నూతన జీఎం రాజేశ్వర్‌రెడ్డి

ఫటాఫట్



కాకతీయఖని, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో 1988లో మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ(ఎంజీటీ)గా తన ప్రస్థానాన్ని మొదలు పెట్టి అండర్ మేనేజర్‌గా, అసిస్టెంట్ మేనేజర్‌గా, మేనేజర్‌గా, ప్రాజెక్ట్ అధికారిగా, ఎస్‌వోటూ జీఎంగా అంచలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం ప్రమోషన్‌పై భూపాలపల్లి ఏరియాకు జనరల్ మేనేజర్(జీఎం)గా వచ్చిన ఏనుగు రాజేశ్వర్‌రెడ్డితో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ...

ఆంధ్రజ్యోతి: కార్మికుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?

జీఎం: సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమం కోసం ఇప్పటికే ఎంతో కృషి చేస్తుంది... కార్మికుల వెల్ఫేర్ విషయంలో నావంతు సహకారాన్ని అందిస్తా. ఉద్యోగులకు రావాల్సిన అన్ని బెనిఫిట్ అందేలా చూస్తా...

ఆంధ్రజ్యోతి: యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు లక్ష్యాలను చేరుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టనున్నారు...?

జీఎం: అధికారులు, కార్మికులను సమన్వయం చేస్తూ యాజమాన్యం నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేస్తా... అందుకు కార్మిక సంఘాల నాయకులు, గని, ప్రాజెక్ట్ అధికారుల సహకారాలు కావాలి. వారందరి సహకారాలతో రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని చేపడుతా. లక్ష్యాన్ని చేరుతాం.

ఆంధ్రజ్యోతి: ప్రధానంగా ఏరియాలోని ఓసీ-2,3 ప్రాజెక్టుల్లో భూసేకరణ సమస్య అధికంగా ఉంది. దానిని ఎలా ఎదుర్కొంటారు...?

జీఎం: జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సలహాలు తీసుకుంటూ గ్రామస్తులతో కలిసి మాట్లాడి భూసేకరణ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తా. అలాగే గడ్డిగానిపల్లి, కొండరాజిరెడ్డిపల్లి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ఇప్పించి ముందుకు సాగుతాం.

ఆంధ్రజ్యోతి: ఏరియాలో కార్మికుల గైర్హాజరు శాతం అధికంగా ఉంది... ఎలా కట్టడి చేయబోతున్నారు...?

జీఎం: గనులు డిపార్టుమెంట్లలో ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. అలాగే సేవా మెంబర్లతో కార్మికుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తూ గైర్హాజరు శాతాన్ని తగ్గించేందుకు కృషిచేస్తా...

ఆంధ్రజ్యోతి: ఏరియాలో డిప్యూటేషన్, క్వార్టర్స్, సర్ఫేజ్ వంటి అంశాలలో పలు ఆరోపణలు ఉన్నాయి... వాటిని ఎలా కట్టడి చేయబోతున్నారు...?

జీఎం: చార్జ్ తీసుకుంది ఇప్పుడే కదా... ఈ విషయంపై నేను ఇప్పుడే ఏం చెప్పలేను. సింగరేణి అభివృద్ధికి నీతి నిజాయతీ, నిబద్ధతతో అందరిని కలుపుకుని పనిచేస్తాను. ఆరోపణల లేకుండా సమన్వయంతో పనిచేస్తా.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ములుగు కలెక్టర్ దివాకర



ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని ప్రజలనుంచి 62దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం చేయవద్దని, ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరిం చాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం అంశంపై శాఖలవారీగా కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు, వాటికి గల కారణాలు, పరిష్కరించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక వివరాలను కలెక్టర్ తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, డీసీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, డీపీవో తేజోవతి, డీడబ్ల్యూవో ఇన్‌చార్జి శిరీష, డీఎండీసీవో రాంపతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలి

భూపాలపల్లి కలెక్టరేట్ : ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించాలన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ వినతులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 21 దరఖాస్తులు వచ్చాయి. ఈకార్యక్రమంలో ఆర్డీఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన జీఎం రాజేశ్వర్‌రెడ్డి



కాకతీయఖని, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాకు ఇటీవల బదిలీపై వచ్చిన జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా పట్టణంలోని శ్రీ రామాలయ దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం జీఎం కార్యాలయానికి వచ్చి సంతకం చేసి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం నూతన జీఎంకు పలువురు అధికారులు, నాయకులు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం



పత్తి కాంటాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

ములుగు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభయ్యాయి. ములుగు మండలం జాకారం వద్ద గల రాజరాజేశ్వర కాటన్ అండ్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ సోమవారం ప్రారంభించారు. సీసీఐ నిబంధనలకు లోబడి కొనుగోళ్లు జరపాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కలప పట్టివేత



పట్టుబడిన కలప, వాహనం

కాకతీయఖని, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జీవన్ పికప్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను భూపాలపల్లి అటవీశాఖ అధికారులు ఆదివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. భూపాలపల్లి రేంజ్ అధికారి నరేష్ బస్వ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఓ వ్యక్తి వాహనంలో కర్రను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి చెల్పూరు వరకు వెంబడించి పట్టుకున్నామన్నారు. అయితే డ్రైవర్ బండి అక్కడే వదిలిపెట్టి వెళ్లాడని, అందులో 21 జిట్రేగి దుంగలు ఉన్నాయని, అవి సుమారు 80 ఫీట్లు ఉంటాయని అన్నారు. బహుశ వాటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీట్ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మోరంచపల్లి పథకానికి మోక్షం

- మరమ్మతులకు రూ. 34.20 లక్షల మంజూరు
- సాగులోకి రానున్న 600 ఎకరాలు



వరదలకు ధ్వంసం అయిన ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలం మొరంచపల్లి గ్రామం వద్ద మొరంచవాగుపై ఉన్న ఎత్తిపోతల పథకం మరమ్మత్తులకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. గతేడాది వరదల కారణంగా దెబ్బతిన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రిపేర్లకు ప్రభుత్వం రూ. 34.20 లక్షలను మంజూరు చేసింది. నిధులు మంజూరు కావడంతో అధికారులు త్వరలోనే టెండర్లు పిలిచి మరమ్మత్తులు చేసి రైతులకు సాగు నీరు అందించనున్నారు. దీంతో రైతుల సమస్యలు తీరనున్నాయి.

600 ఎకరాలకు సాగునీరు

మొరంచపల్లి గ్రామం గుండా వెళ్తున్న మొరంచవాగుపై 1980 సంవత్సరంలో రూ.37లక్షలతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఈ పథకం ద్వారా మొదటి 1200 ఎకరాల భూములకు సాగు అందగా ఇప్పుడు దాదాపు 600 ఎకరాలపైగా భూములకు సాగు నీరు అందుతుంది. గతేడాది జూలైలో వచ్చిన వరదల కారణంగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మోటార్లు, విద్యుత్ వ్యవస్థ మొత్తం ధ్వంసమయింది. దీంతో రైతుల పంటలకు సాగునీరు కరువైంది. చేసేదేంలేక రైతులు గతేడాది వానాకాలం, యాసంగీ, ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో భూములకు బీళ్లుగా ఉంచారు. ప్రాజెక్టు పూర్వ స్థితికి తెచ్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



నెల్లికుదురులో ఆర్చరీ క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఆర్చరీ క్రీడలు షురూ

నెల్లికుదురు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ ఆవరణలో 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఆర్చరీ క్రీడలు, ఫెన్సింగ్ క్రీడలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలకు అండర్-14 నుంచి 17 వరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు క్రీడలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఈవో రాందాస్, ప్రధానోపాధ్యాయులు రవి, జీవన్‌కుమార్, క్రీడల ఇన్‌చార్జ్ ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గండి సత్యనారాయణగౌడ్, ఫిజికల్ డైరెక్టర్లు చెడుపల్లి ఐలయ్య, ప్రవీన్, సునీత తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి చెకుముకి సైన్స్ సంబురాలు



పోస్టర్ల ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, జేవీవీ ప్రతినిధులు

జఫర్‌గఢ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వ తేదీ నుంచి మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చెకుముకి సైన్స్ సంబురాలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం తిమ్మంపేట హైస్కూల్‌లో సైన్స్ సంబురాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజల్లో మూఢ నమ్మకాలను పారదోలి వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ ఏటా చెకుముకి పేరుతో శాస్త్రీయ విజ్ఞాన చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.

ఇందులో భాగంగా విద్యాశాఖ సమగ్ర శిక్ష సహకారంతో పాఠశాల స్థాయిల్లో ఈనెల 7న మండల స్థాయి, 21, 28వ తేదీల్లో జిల్లా స్థాయి, డిసెంబరు 14,15,16వ తేదీల్లో రాష్ట్ర స్థాయిల్లో విద్యార్థులకు ఆయా అంశాలపై పోటీలు, పరీక్షలు, వంటి అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో హెచ్ఎం డి. షారోన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడ్స్‌ను జాగ్రత్తగా నమోదు చేయాలి

- సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలి
- జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేబడుతున్న సమగ్ర ఇంటింటి, కుటుంబ, సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను సంబంధిత సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా తెలిపారు. సోమవారం ఘన్‌పూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 గృహాలను ఎంపిక చేసుకొని కుటుంబ సర్వే నిర్వహించాల్సి ఉంటుం దన్నారు. ఈనెల 6 నుంచి 18 వరకు సమగ్ర కుటుంబ సర్వే ఉంటుం దన్నారు. సర్వే నిర్వహించే ఎన్యుమరేటర్‌లు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించే క్రమంలో ప్రజలతో సామరస్యంగా ఉండి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

సర్వేలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు అని సూచించారు. సర్వే ఫామ్‌ను నింపే క్రమంలో సిబ్బంది కోడ్స్‌ను జాగ్రత్తగా నింపాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీవో స్వరూప, ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, తహసీలాదర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు రవీందర్, సతీష్, శివునిపల్లి ఈవో తిరునగిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్యుమరేటర్లకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

లక్ష్యం, క్రమశిక్షణతో ఎదగాలి

- అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య
- ప్రథమ స్థానంలో రంగారెడ్డి బాలబాలికల జట్లు



బాస్కెట్‌బాల్‌లో ప్రథమ స్థానం ట్రోఫీని రంగారెడ్డి బాలికల జట్టుకు అందజేస్తున్న అదనపు ఎస్పీ చెన్నయ్య

కేసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ క్రీడాకారులు ఆటలో గోల్‌ను ఎలా టార్గెట్ చేసుకుంటారో అదే మాదిరిగా తమ జీవితంలో లక్ష్యం ఏర్పర్చుకొని క్రమశిక్షణతో ఎదగాలని జిల్లా అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) తెలంగాణ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్, వూషూ పోటీలు సోమవారం ముగిశాయి.

ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, తమ తోటి క్రీడాకారుల పట్ల క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, రూరల్ సీఐ సర్వయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, డీవైఎస్‌వో జ్యోతి, పీజీహెచ్‌ఎంలు బందెల రాజు, బండారు నరేందర్, నిర్వాహకులు రావుల మురళి, కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, నాగసబోయిన వెంకటేశ్వర్లు, ముదిగిరి సదయ్య పాల్గొన్నారు.

బాలబాలికల విభాగాల్లో ఒకే జిల్లా జట్లు..

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో యాదృచ్ఛికంగా వివిధ స్థానాల్లో బాలబాలికల విభాగాల్లో ఒకే జిల్లా జట్లు విజయం సాధించడం విశేషం. బాలబాలకల విభాగాల్లో ఫైనల్స్‌కు రంగారెడ్డి-హైదరాబాద్ జట్లు చేరగా బాలురు 18-8, బాలికలు 19-6 స్కోర్‌తో రెండు విభాగాల్లో రంగారెడ్డి జట్లు గెలుపొందాయి. ప్రథమ స్థానం రంగారెడ్డి, ద్వితీయ స్థానం హైదరాబాద్ జట్లు, తృతీయ స్థానం ఖమ్మం, నిజామాబాద్ సంయుక్తంగా బాలబాలికల విభాగంలో విజయం సాధించడం గమనార్హం. విజేతలకు పతకాలు, కప్, ప్రశంసా పత్రాలను ఏఎస్పీ చెన్నయ్య అందజేశారు. కాగా, రాష్ట్ర స్థాయి వూషూ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ నిజామాబాద్ జిల్లా, ద్వితీయ స్థానం ఆదిలాబాద్, తృతీయ రంగారెడ్డి జిల్లాలు సాధించగా విజేతలకు ఆదివారం రాత్రి పతకాలను అందజేశారు.

కోడి పందెం రాయుళ్ల రిమాండ్

ఏటూరునాగారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక గ్రామ పరిధిలో సోమవారం కోడి పందెం దారులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై ఎస్.కె తాజుద్దీన్ కథనం మేరకు.. ఏటూరునాగారం మండలం చల్పాక గ్రామ సమీపంలో కొంత మంది కోడిపందేలు ఆడుతున్నారనే పక్క సమాచారం మేరకు ఎస్సై తాజుద్దీన్ తమ సిబ్బందితో కలిసి స్థావరాలపై ఆకస్మిక దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతేకాకుండా నిందితుల నుంచి రూ. 1400 జప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏడుగురిపై కేస్ నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై వెంట పోలీసులు హరీష్, అజయ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కూతురిపై కన్నేసి.. పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి..

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి ▸ జనగామ జిల్లాలో ఘటన

రఘునాథపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అతడు ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు కూతుళ్లకు జన్మనిచ్చాడు. కానీ ఆ విచక్షణను మరిచిన ఆ వ్యక్తి కూతురిపైనే కన్నేసి పెళ్లి చేసుకుంటానని సహజీవనం చేస్తున్న మహిళపై ఒత్తిడి చేయడంతో ఓ కన్నతల్లి పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ... జనగామ జిల్లా యశ్వాంతపూర్‌కు చెందిన రాజేందర్ అనే వ్యక్తి ఓ మహిళను హైదరాబాద్‌లో ఉంచి సహజీవనం కొనసాగిస్తున్నాడు.

ఈ క్రమంలో వారు ఇద్దరు కూతుళ్లకు జన్మనివ్వగా పెద్దకూతురు 8వ తరగతి చదువుతోంది. కొన్ని రోజులుగా పెద కూతురిపై కన్నేసిన రాజేందర్ ఆమెను పెళ్లి చేసు కుంటానంటూ తనతో సహజీవనం చేస్తున్న మహిళను బెదిరిస్తూ, వేధింపులకు గురి చేస్తున్నాడు. దాన్ని తట్టుకోలేక సదరు మహిళ అక్టోబరు 28న రఘునాథపల్లి పోలీసులకు రాజేందర్‌పై ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై ఎస్ఐ దూదిమెట్ల నరేష్‌ను వివరణ కోరగా, మహిళ ఫిర్యాదు మేరకు రాజేందర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అయితే గతంలో కూడా హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రాజేందర్‌పై ఇదే విషయంలో ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు పేర్కొంది.

'ఇందిరమ్మ' దరఖాస్తుదారుల్లో ఆనందం

(5వ పేజీ తరువాయి)

నిర్మాణమై పూర్తయిన, ఇంకా పూర్తికాక మధ్య నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాలుండగా ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 42 వేల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కే అవకాశం ఉంది. అయితే ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం ఆరు హామీల్లో ఒకటిగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 2,88,000 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సొంత స్థలం, ఇల్లు కూడా లేనివారు 2,30,400 మంది కాగా, స్థలం కలిగిన వారు 57,000 మంది ఉన్నారు.

మొదటి విడతగా నియో జకవర్గానికి 35,000 ఇళ్లనే మంజూరు చేయాల్సి ఉన్న దృష్ట్యా దరఖా స్తుదారుల్లో అర్హులను ఎంపిక చేయడం అధికారులకు సమస్య కాను న్నది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గత ప్రభుత్వం కలెక్టర్ల చేతిలో పెట్టింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగనున్నది. ప్రతీ నియోజకవర్గంలో వారి మాటకే ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యం ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లోని నేతలు తమకు అనుకూలంగా ఉన్నవారికి ఇప్పించుకునేందుకు ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఇందిరమ్మ కమిటీలు..

ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవంగా ఈ కమిటీలను గ్రామ సభల ద్వారా నియమించాల్సి ఉన్నా స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులతో కమిటీలకు తుది రూపం ఇచ్చారు. కమిటీల జాబితాను కలెక్టర్లకు అందజేశారు. అయిదుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేశారు. ఇందులో ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శికి స్థానం కల్పించారు. గ్రామ పంచాయతీల్లో, పురపాలక సంఘాల్లో ఇందిరమ్మ కమిటీలు, అధికారులు కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. గ్రామ సభలు నిర్వహించిన దరఖాస్తుల పరిశీలన అనంతరం కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇందిరమ్మ కమిటీలను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆమోదించాల్సి ఉంది.

మళ్లీ మొదలైన విజిలెన్స్ విచారణ ?

కాకతీయఖని, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-3లో ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన లోడర్లకు అధిక మీటర్ రీడింగ్ రాసినట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. గత నెల 29, 30వ తేదీల్లో సంబంధిత అధికారులు, ప్రైవేటు ఆపరేటర్లను రెండు రోజుల పాటు విచారించారు. ఈ క్రమంలో దీపావళి పండుగ రావడంతో కాస్త విరామం ఇచ్చిన విజిలెన్స్(ఎస్‌టీపీపీ) అధికారులు తిరిగి 4న విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలోని సింగరేణి(కాకతీయ) మైనింగ్ ఓసీ-3కి చెందిన నలుగురు సూపర్ వైజర్లను విచారించినట్లు సమాచారం. లోడర్ల విషయంలో మీ ప్రమేయం ఏమన్నా ఉందా ? అధిక రీడింగ్ రాసినట్లు మీ దృష్టికి రాలేదా ? మీకు తెలియకుండా బిల్లులు సాంక్షన్ అయ్యాయా ? అని సదరు సూపర్‌వైజర్లను విజిలెన్స్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో వారు మా సంతకాలు లేకుండానే బిల్లులు పాస్ అయ్యాయని చెప్పడంతో రీడింగ్ బుక్స్‌లలో మీ సంతకాలు ఉన్నాయి కదా అని అడగడంతో అవి మా సంతకాలు కావు.. ఎవరో మా సంతకాలు ఫోర్జరీ చేశారంటూ సూపర్ వైజర్లు విజిలెన్స్ తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో మీ ప్రమే యం లేదని లెటర్ రాయించి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరి కొందరు సూపర్ వైజర్లను మంగళవారం ఉదయం రావాల్సిందిగా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. సంతకాలు ఫోర్జరీ జరిగిందా ? లేక వీరి ప్రమేయం ఎంత ఉంది ? బిల్లుల సాంక్షన్‌లో వేరే ఎవరి హస్తం ఉందో తేల్చేందుకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

ప్రతిఘటన పోరాటాలతోనే ప్రజలకు విముక్తి

సీపీఐ(ఎంఎల్) ఎన్డీ రాష్ట్ర నాయకురాలు అనురాధ



మచ్చర్లలో మాట్లాడుతున్న నాయకురాలు అనురాధ

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిఘటన పోరాటాలతోనే పీడీత ప్రజలకు విముక్తి కలుగుతుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ అన్నారు. గూడూరు మండలం మచ్చర్లలో రాసూరి యాకన్న స్మారక బహిరంగ సభను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ... గోదావరి లోయ ప్రతిఘ టన పోరాటంలో అనేక మంది విప్లవవీరులు అమరత్వం పొందా రన్నారు. వారి ఆశయాలను నేటితరం ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. దేశంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా దున్నే వాడికే భూమి అనే ప్రతిపాదికన అనేక ఉద్యమాలు నిర్వహించి లక్షలాది ఎకరాలు పేదలకు పంచిన ఘనత విప్లవ పార్టీలకే దక్కుతుందన్నారు. ఉన్నత ఆలోచనలు, చదువులు, తమ కుటుంబాల బంధుత్వాలను వదులుకుని పేదల అభ్యున్నతే లక్ష్యంగా భావించి తమ ప్రాణాలను విప్లవోద్యమంలో అర్పించినట్లు చెప్పారు. చంద్ర పుల్లారెడ్డి, చార్‌మంజుదార్, తరిమేల నాగిరెడ్డి, కోల వెంకయ్య, నీలం రాంచంద్రయ్య, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణసింగ్, పైల వాసుదేవరావు, దొరన్న, గణేష్, రాసూరి యాకన్న, చిన్నం కోటి, పెనక విక్రమ్ లాంటి విప్లవకారులు ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. భారత విప్లవోద్యమాన్ని 2026 మార్చి నాటికి నిర్మూలిస్తామని పాలకులు మాట్లాడడం తగదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా పేదలు ఇంకా కడు పేదరికంలోనే మగ్గుతున్నారని, నిరుద్యోగం, నిరక్షరా స్యత, అసమానతలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. అనంతరం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆట.. పాట పలువురిని ఆకట్టుకున్నాయి. రాసూరి యాకన్న, చిన్నం కోటిల స్మారక స్థూపాలకు నివాళులర్పించారు. ఈ సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, బండారి ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, గూడూరు సబ్ డివిజన్ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం, జిల్లా నాయకులు బూర్క వెంకటయ్య, శివ్వారపు శ్రీధర్, లింగ్యా, భట్టు చైతన్య, నేతకాని రాకేష్, గజ్జి లింగయ్య, హలావత్ లింగ్యా, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు బోనగిరి మధు, కొట్టెం అచ్చన్న, చాడబోయిన నర్సయ్య, అడ్డూరి వెంకన్న, సనుప వీరస్వామి, వజ్జన్న, సమ్మయ్య, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ వర్సిటీ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ప్రారంభం

కేయూ క్యాంపస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ప్రీ పీహెచ్‌డీ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమ య్యాయి. సోమవారం కేయూ క్యాంపస్‌లో జరిగిన పరీక్షల తీరును కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు పర్యవేక్షించారు. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, న్యాయశాస్త్రం, ఇంజనీరింగ్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్ విభాగాల్లో పరీక్షల నిర్వహిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ మ్యాగజైన్‌లో ధన్నసరి పట్టు రైతుకు చోటు

కేసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సిల్క్ బోర్డు రూపొందిస్తున్న మ్యాగజైన్‌లో కేసముద్రం మండలం ధన్నసరికి చెందిన పట్టు పురుగుల సీడ్ పెంపకం రైతు వేం పార్థసారధిరెడ్డి కథనానికి చోటు దక్కింది. రాష్ట్రంలో పట్టుపురుగుల సీడ్‌ను విక్రయించే వారిలో యువ రైతు కావడంతో ఆయనకు ఈ స్థానం దక్కినట్లు తెలిసింది. ఆయన కేంద్రం నుంచి రెండు జిల్లాల్లోని పట్టుపురుగుల పెంపకం కేంద్రాలకు సీడ్‌ను విక్రయిస్తుంటాడు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులకు దుప్పట్లు, చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై పంపిణీ చేశారు. 153 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో భవనాన్ని నిర్మించనున్నామని, దానికి రూ.50లక్షలు మంజూరుచేపించినట్లు తెలిపారు. మరో 60రోజుల్లో రెడ్‌క్రాస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని అన్నారు. భూపాలపల్లిలో విలువైన భూములు గతంలో అన్యాక్రాంతం అయ్యాయని అన్నారు. 774 సర్వే నెంబర్‌లోని 7వందల ఎకరాలు, ఇతర ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములను వేటిని వదిలేదిలేదని స్పష్టం చేశారు. ఆ భూములన్నింటిని కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కోసం ప్రధానరోడ్డుకు స్థలం సేకరించినట్లు తెలిపారు. కోర్టుకు కూడా స్థానికంగానే స్థలం కేటాయించేలా చూస్తామని అన్నారు. గత పదేళ్లలో రోడ్డు ప్రమాదాల్లో వెయ్యికిపైగా మృతి చెందారని, వెంటనే దాని నివారణకు రింగురోడ్డు నిర్మాణం చేపడతామని అన్నారు. అటవీశాఖ అనుమతి తీసుకుని పనులు ప్రారంభి స్తామని చెప్పారు. గణపురంలోని గాంధీనగర్ వద్ద 60ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్కు కోసం స్థలం కేటాయించడం జరిగిందని అన్నారు. ఇక్కడ అర్హులైన పేదవారు పరిశ్రమలు పెట్టుకోవచ్చని, అందుకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి 4వేల ఇండ్లు మంజూరు చేపించినట్లు తెలిపారు. 4లైన్ల రోడ్డు నిర్మాణం కోసం టెండరు ప్రక్రియ కూడా పూర్తి కానుందని అన్నారు జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగు తుందని అన్నారు. అలాగే రైతులకు రూ.500 బోనస్ ఇప్పిస్తామని ఎమ్మెల్యే జీఎస్ఆర్ స్పష్టం చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ కిరణ్ మాట్లాడారు. భూపాలపల్లి ప్రాంతంలో రెడ్‌క్రాస్ సంస్థ సేవలు ఎంతో అవసరమని అన్నారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు జగదీష్, నవీన్, ప్రవీణ్, లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు బుర్ర కొందయ్య, ఇస్లావత్ దేవన్, దాట్ల శ్రీనివాస్, అప్పం కిషన్, ముంజాల రవీందర్, పిప్పాల రాజేందర్ పాల్గొన్నారు.

రామప్పలో శివకేశవుల పూజలు

మహాకాల అవతారంలో రామలింగేశ్వరస్వామి

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు మాసాల్లో విశిష్టమైన కార్తీకమాసంలో శివకేశవులను భక్తిశ్రద్ధలతో పూజిస్తే ప్రతి ఇల్లు దేవాలయంగా మారి పోతుందని రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు కోమల్లపల్లి హరీష్‌శర్మ, ఉమాశంకర్ తెలిపారు. కార్తీక సోమవారం సందర్భంగా రామప్ప రామలింగేశ్వరుడు మహాకాల అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. కార్తీకమాసంలో వచ్చే సోమవారానికి అత్యంత విశేషమైన ప్రాముఖ్యత ఉంటుంది. ఈ మాసంలో వచ్చే ప్రతి సోమవారం ఉపవాసం ఆచరించి రాత్రి దీపం వెలిగించి నక్షత్రాల దర్శనం చేసుకున్న తర్వాత భోజనం చేసేవారు శివుడి అనుగ్రహం పొందు తారని అర్చకులు తెలిపారు. కార్తీక సోమవారం రోజు చేసే పూజ అత్యంత ఫలమైనదని, ఈరోజు ఉపవాసం ఉంటే అశ్వమేధ యాగం చేసిన ఫలితం లభిస్తుందని భక్తులకు సూచించారు. రమాదేవి కుటుంబసభ్యులు స్వామివారికి వెండి మంగళహారతి ప్లేటు, మాణిక్యాలను బహూకరించారు. ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామి



వెండి మంగళహారతి ప్లేటు, మాణిక్యాలను అందిస్తున్న రమాదేవి

టీపీఎస్సీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రంజిత్‌కుమార్



మహబూబాబాద్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవోస్ అనుబంధ తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం(టీపీఎస్‌సీఎఫ్) రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మహబూబాబాద్ పట్టణానికి చెందిన నాగవెల్లి రంజిత్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ నాంపల్లిలో టీఎన్జీవోస్ భవన్‌లో సోమవారం జరిగిన ఎన్నికల్లో టీపీఎస్‌సీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రంజిత్‌కుమార్ గెలుపొందినట్లు టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగుల జాక్ చైర్మన్ మారం జగదీశ్వర్ ప్రకటించారు. మహబూబాబాద్‌కు చెందిన రంజిత్‌కుమార్ కేసముద్రం మండలం ఉప్పరపల్లి కార్యదర్శిగా పని చేస్తున్నారు. 18 సంవత్సరాలుగా కార్యదర్శుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. గతంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన ఆయన తాజాగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, టీజీవో జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ రఫీ, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2311	2080
పల్లికాయ (సూక)	5900	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	---	---
పెసళ్లు	5422	4052
పత్తి	6910	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	5555	4550
పసుపు (గోల)	4545	4040
తేజ మిర్చి	12500	9000
తేజ ఏసీ	16700	12000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం



మహానంది అవార్డు అందుకుంటున్న శ్రీనివాసాచారి

- కార్యక్రమాల నిర్వహణ, పుస్తకాల రచనలు చేస్తున్న సిద్ధోజు
- అమ్మ భాష పరిరక్షణకు పలు కార్యక్రమాల నిర్వహణ
- పలువురి ప్రశంసలు, పురస్కారాలు అందుకున్న శ్రీనివాసాచారి


అభినందిస్తున్న మంత్రి కొండా సురేఖ (ఫైల్)

తెలుగు భాషా సేవలో..

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వతహాగా తెలుగు పండితుడు, తెలుగు భాషాభిమాని అయిన సిద్ధోజు శ్రీనివాసాచారి తెలుగులో రచనలు చేస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. పర భాషా మోజులో మాతృ భాషను చిన్న చూపు చూడొద్దని, మన భాషను మనం కాపాడుకుందామని నిరంతరం తపిస్తున్నారు స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీనివాసాచారి. ఏటా మాతృ భాషా దినోత్సవం, మాండలిక భాషా దినోత్సవం, కాళోజీ జయంతి, దాశరథి జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కూడా పనిచేస్తున్న ఆయన స్కూళ్లలో కథల పోటీలు, కవితలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాక తెలుగు భాష ప్రాశస్త్యం అందరికీ తెలియజేయడానికి పలు పుస్తకాలు రాశారు. ఘన్‌పూర్ కృష్ణవేణి హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న శ్రీనివాసాచారి తెలుగు భాషాభివృద్ధిలో తన వంతు సేవ కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

రాసిన పుస్తకాలు ఇవీ..

తెలుగు భాషతో పాటు తెలంగాణ ఔన్నత్యం తెలియజేస్తూ పలు పుస్తకాలు రాశారు. మహా భారతం, సరస్వతీ సులభ వ్యాకరణం, సంపూర్ణ రామాయణం, వరంగల్ జిల్లాలో దర్శనీయ స్థలాలు, దేవాలయాలు, మేడారం శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతర అనే పుస్తకాలు రాసి వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రచురించారు. ఈ పుస్తకాల ద్వారా జిల్లాలో పలువురి ప్రశంసలు అందుకున్నారు. భాషా దినోత్సవాలు, భాషా, సాహితీ వేత్తల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తు భాషామతల్లి సేవలో తరిస్తున్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నారు. శ్రీనివాసాచారి ఎంఏ, టీపీటీ చదివారు. పదేళ్లుగా తెలుగు పండిట్‌గా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన భాషా సేవలకు గాను పలు అవార్డులు, సత్కారాలు అందుకున్నారు. వరంగల్‌లో కృష్ణవేణి కళా సమితి ఉగాది పురస్కారం, కరీంనగర్‌లో తెలుగు భాషా సంక్షేమ సంఘం నుంచి రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం అందుకున్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జనగామలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనంలో కవి నందినీ సిధారెడ్డితో సత్కారం పొందారు. శ్రీనివాసాచారి సేవలను గుర్తించి భారతీయ దళిత సాహిత్య అకాడమీ 2016–2017 సంవత్సరానికి జ్యోతిరావ్ పూలే అవార్డుకు ఎంపిక చేయగా శ్రీనివాసాచారి ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. అలాగే తాజాగా తెలుగు సంస్కృతీ సాహితీ సేవా ట్రస్ట్ తెలంగాణ, ఏపీ వారు తాను రాసిన మహాభారతం పుస్తకానికి గాను జాతీయ స్థాయి మహానంది అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ తదితరులు అభినందించారు.


శ్రీనివాసాచారి ప్రచురించిన పుస్తకాలు

తెలుగు భాషను బతికించుకోవాలి

శ్రీనివాసాచారి, తెలుగు భాష పండిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు



నానాటికీ తగ్గిపోతున్న తెలుగు భాషను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తెలుగు వారంతా తెలుగు మాట్లాడడమే కాకుండా తమ పిల్లలకు తెలుగులో కథలు, సామెతలు, పురాణాలు, కవితలు నిత్యం చదివించాలి. పరాయి భాషపై వ్యామోహం వీడి.. మాతృ భాషలో చదివితేనే విషయ పరిజ్ఞానం, విలువలు, బంధాలు పెరుగుతాయని గ్రహించాలి. తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. అన్ని ప్రభుత్వ శాఖల్లో బోర్డులతో పాటు జీఓలు, నోటీసులు అన్ని తెలుగులోనే ఇవ్వాలి. తెలంగాణ భాష, మాండలిక రచనలు, కవిత్వం, కవులు, రచయితలను ప్రోత్సహించాలి.

మీకు తెలుసా ?


శివునిపల్లికి..
ఆ పేరెలా వచ్చిందంటే..

జనగామ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లిని జంటపట్టణాలుగా పేర్కొంటారు. ఈ రెండు పట్టణాలకు మధ్యలో రైల్వే గేట్ ఒక్కటే అడ్డం. ఆ గేటుకు 150మీటర్ల దూరంలో ఊరి మధ్యలోనే రైల్వేస్టేషన్ ఉంటుంది. 1889లో ఈ రైల్వే స్టేషన్ నిర్మాణం జరగ్గా.. అంతకు ముందు ఈ ఊరిని చిన్నపల్లె అనే వారు. చిన్నపల్లెకు ఆనుకుని ఆబాది ఘన్‌పూర్ ఉండేది. రైల్వే స్టేషన్ ఏర్పడ్డాక రైల్వే శాఖ వారు స్టేషన్ ఘనాపూర్ అని స్టేషన్‌లో బోర్డు ఏర్పాటు చేశారు. చిన్న పల్లె కాస్తా స్టేషన్ ఘనాపూర్‌గా మారింది. పక్క పక్కనే స్టేషన్ ఘన్‌పూర్, ఆబాది ఘన్‌పూర్ రెండు గ్రామాలు ఉండడంతో ప్రజలకు వాటిని గుర్తించడంలో కొంత అయోమయం ఏర్పడింది.

కాల క్రమంలో చిన్నపల్లెలో నగేరేశ్వ రాలయం (శివాలయం) నిర్మితం కావడంతో స్టేషన్ ఘన్‌పూర్‌ను శివునిపల్లె అని పిలవడం మొదలు పెట్టారు. ఇలా గ్రామాన్ని గుర్తించడం సులభం కావడంతో చివరికి అదే పేరు స్థిర పడింది. వాస్తవానికి శివునిపల్లి ఆబాది ఘన్‌పూర్ కంటే పెద్ద వ్యాపార కేంద్రంగా విలసిల్లింది. పోలీస్ స్టేషన్‌తో పాటు మొట్ట మొదటి పోస్ట్ ఆఫీసు, బ్యాంకు, తహసిల్ ఆఫీసు, రిజిస్ట్రేషన్ ఆఫీసు, రైస్ మిల్లులు, దుకాణాలు, సినిమా థియేటర్ అన్నీ శివునిపల్లిలోనే ఉండేవి. కానీ 1980 తర్వాత రైల్వే గేటు ఇబ్బందికరంగా ఉందని అన్నీ ఆబాది ఘన్‌పూర్‌కు తరలించారు.

\- స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్



శివాలయం



శివునిపల్లి ఏకశిలా చౌరస్తా

చిలుపూర్‌గుట్టపై
వెంకన్న రూపం
సామాజిక మాధ్యమాల్లో వైరల్

చిలుపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరి న కోర్కెలు తీర్చే కొంగు బంగారం, బుగులు వేంకటేశ్వర స్వామి కొలువైన చిలుపూర్‌గుట్ట పైభాగంలో, సాక్షాత్తు తిరుమల తిరుపతి కొండపైనున్న స్వామివారి రూపం ఉన్నట్లుగా గూగుల్ ద్వారా చిత్రీకరించిన మ్యాప్ ప్రస్తు తం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రెండున్నర కిలోమీటర్ల ఎత్తులో ఉన్న గుట్ట పైభాగంలో ఏదో అద్భుతం ఉన్నట్లుగా గుర్తించిన స్థానిక పూజారి కృష్ణమాచార్యులు గూగుల్ మ్యాప్ ద్వారా పరిశీలించగా, అక్కడ స్వామివారి నిజ స్వరూపం, గరుడపక్షి, హనుమంతుడు ఉన్నట్లుగాను, అక్కడినుంచి అరకిలోమీటరు దిగువన స్వామివారి నామాలు ఉన్నట్లు గూగుల్‌లో కనిపించింది.



చిలుపూర్ గుట్టపై వెలసిన్న స్వామి వారి రూపం

సామాజిక సేవలో రా'రాజు'

- జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు ఆయన సొంతం
- 35 సార్లు రక్త దానం చేసిన కానిస్టేబుల్

ఖానాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా కానిస్టేబుల్ అయిన ఆయన సమాజానికి స్నేహ హస్తం చాచి వివిధ సేవా కార్యక్రమాలతో రా'రాజు'గా.. పలువురికి ఆదర్శంగా నిలుస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆపదలో ఉన్న పలువురికి 35 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. విధులతో పాటు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు

వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మం డలం రాగంపేట గ్రామానికి చెందిన రాజు కన్నె కుమారస్వామి, రమణి దంప తుల పెద్ద కుమారుడైన రాజు ప్రస్తుతం కానిస్టేబుల్‌గా విధులు న్విహిస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న రాజు ఉన్నత విద్యను అభ్యసిస్తూనే 2005 నుంచి సామాజిక సేవా కార్యక్రమాలకు నాంది పలికారు.

19ఏళ్లుగా కొనసా గుతున్న ఆయన సేవా కార్యక్రమాలను గుర్తించిన పలు సంస్థలు ఆయనకు అవార్డులు అందించి సత్కరించాయి. 2009సంవత్సరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరినప్పటి నుంచి ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగా సేవలందిస్తూ పలువురి ప్రశంసలు అందుకున్నారు.

ఇప్పటివరకు 35 సార్లు రక్తదానం చేసిన ఆయన తన మిత్రుల సహాయంతో సుమారు 17,578 మంది ఆపదలో ఉన్న వారికి రక్తం సమకూర్చారు. స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత, హరితహారం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం. మూఢ నమ్మకాలు, ఎయిడ్స్ నిర్మూలన, అవయవదానం, రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, స్త్రీ విద్యను ప్రోత్సహించడం, ప్రభుత్వ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ, పరీక్షా సామగ్రి పంపిణీ, రాగంపేట గ్రామంలో టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతుల్విడం లాంటివి చేస్తుంటారు. ఓటరు నమోదు, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణకు అవగాహన తదితర కార్యక్రమాల్లో చరుకుగా పాల్గొంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

ఆదర్శం



మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి అవార్డు అందుకుంటున్న రాజు (ఫైల్)

పలు అవార్డులు సొంతం

సామాజిక సేవా రంగంలో రాణిస్తున్న రాజు పలు అవార్డులు అందుకున్నారు. సామాజిక సేవా రంగంలో గ్రామీణ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసినం దుకుగాను మొదటి సారిగా 2019లో మనం మన ఊరి బడి అవార్డు, అదే ఏడాది జాతీయస్థాయి ఉగాది పురస్కారం, రాష్ట్ర స్థాయి ఆదర్శ పోలీస్ అవార్డు, సేవారత్న అవార్డు, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, జాతీయ స్థాయి తెలంగాణ కళారత్న అవార్డు అందుకున్నారు.


అంతకుముందు 2005 నుంచి పలు సందర్భాల్లో ఉత్తమ రక్తదాత, ఉత్తమ సామాజిక సేవ, రాష్ట్ర స్థాయి సావిత్రి భాయి పూలే, అంబేద్కర్ ఫెల్లోషిప్ నేషనల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ డైమండ్ సిటిజన్ అవార్డు, స్టేట్ బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు, ఉత్తమ ఉద్యోగి అవార్డు, బెస్ట్ ఎన్ఎస్ఎస్ వలంటరీ అవార్డులు అందుకున్నారు. 2017లో రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడు మెడల్స్ సాధించారు. తాజాగా ఈ ఏడాది మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా హైయెస్ట్ బ్లడ్ డొనేషన్ అవార్డు, 2023లో హర్యానా సీఎం నుంచి రక్తవీర్ పురస్కారం, నిఫా ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు. 2022లో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు.



రక్తదానం చేస్తున్న రాజు (ఫైల్)


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాజు (ఫైల్)


దీపోత్సవాలను ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ ఏసీ సునీత


దత్తక్షేత్రంలో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

నేడు నాగులచవితి

ఏటా పవిత్ర కార్తీకమాసంలో చవితి తిథితో కలిసి వచ్చే నాగుల చవితి పండుగను మంగళవారం జరుపుకోనున్నారు. మహిళలు, పెళ్లికాని యువతులు నాగుల చవితి వేళ ఉపవాసం ఉండి నాగేంద్రుడికి ఇష్టనైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుంటే తమ కోరికలు తీరుతాయన్నది నమ్మకం. ఈ వేడుకల కోసం వరంగల్ నగరంలోని ఉర్సు ప్రాంతంలో ఉన్న నాగమయ్య ఆలయం, ప్రసిద్ధ భద్రకాళి ఆలయ ప్రాంగణంలోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, ఊకల్‌లోని నాగేంద్ర స్వామి ఆలయంతో పాటు హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల దేవాలయం, హనుమకొండ బ్రాహ్మణ వాడలోని నాగుల వీధిలోని ఆలయంతో పాటు హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వర ఆలయం, పబ్లిక్ గార్డెన్స్ ప్రాంతంలోని కొలువైన పుట్టల వద్దకు భక్తులు తరలి రానున్నారు.


అఖండ దీపారాధన చేస్తున్న భక్తులు

ఆలయాలకు కార్తీక శోభ..

- తొలి సోమవారం భక్తుల రద్దీ
- రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజల నిర్వహణ
- వేయి స్తంభాల ఆలయంలో దీపోత్సవం
- పంచ పుష్పాల అలంకరణలో సిద్దేశ్వరుడు

వరంగల్ కల్చరల్ / హనుమకొండ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శివ కేశవుల ప్రీతికరమైన కార్తీక మాసంలో తొలిసోమవారం శివాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజామునుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. శివుడికి ఆలయాల్లో నమక చమక రుద్ర పారాయణాలతో, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి శివుడిని దర్శించుకున్నారు. వరంగల్, హనుమకొండ నగరాల్లోని పలు ఆలయాల్లో శివుడికి పూజలు నిర్వహించి ఉసిరి దీపాలు, జామ పండ్లు, అరటి పండ్లను నైవేద్య నివేదన చేసి మంగళహారతులు ఇచ్చారు. వరంగల్ నగరంలోని శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీదుర్గేశ్వరాలయం, భోగేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, ఆకారపు వారిగుడి శివాలయం, గీతా భవన్‌లోని దాసాంజనేయ ఆలయంలోని శివాలయం, ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, గురుధామం, అయ్యప్ప దేవాలయం, శ్రీభద్రకాళి దేవాలయం, రంగంపేటలోని శ్రీభవాని శంకర ఆలయం, పోతన రోడ్డులోని కుంటి భద్రయ్య దేవాలయం, కరీమాబాద్‌లోని బొమ్మల గుడి, ఎస్ఆర్ఆర్‌తోటలోని శివాలయం, ఖిలా వరంగల్‌లోని శంభులింగేశ్వరాలయం, పెరుకవాడలోని శివాలయం, శివనగర్‌లోని శివాలయం, మార్కండేయ శివ భక్త శివాలయం, ఓసిటీలోని శివాలయం, కాశిబుగ్గలోని శివాలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు.

హనుమకొండలోని చారిత్రక ప్రసిద్ధ వేయి స్తంభాల ఆలయం ఉదయం నుంచే వందలాది భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ రుద్రేశ్వరుడికి అభిషేకాలు భక్తులచే సామూహిక అభిషేకాలు నిర్వహింపచేశారు. సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రదోషకాల సమయంలో సామూహిక దీపోత్సవాన్ని నిర్వహించగా జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామాల సునిత కార్యక్రమాన్ని ప్రారంభించారు. హనుమకొండలోని సిద్దేశ్వరాలయంలో అర్చకులు సిద్దేశుని రవికుమార్, సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామిని ఐదు రకాల పుష్పాలు , రుద్రాక్ష మాలలతో అలంకరింప చేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. అలాగే స్వయంభూ జలేశ్వరాలయంలో అర్చకులు కేసరి రాంనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహింపజేశారు. ఆలయ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఇతర సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గోదావరి హారతి


గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారంగా కార్తీక మాసం ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థాన ప్రధాన రాజగోపురం నుండి మంగళ వాయిద్యాలతో గోదావరి నది వద్దకు బయలుదేరి ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, దేవస్థానం మాజీ చైర్మన్ గుడాల శ్రీనివాస్, మంథని మునిసిపల్ చైర్మన్ పెండ్రి రమ, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ధ్వజ స్తంభం వద్ద సహస్ర దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి త్రివేణి సంగమ గోదావరిలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం నుంచే గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు పసుపు, కుంకుమ, పాలు పట్టు వస్త్రాలతో గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వరస్వాములకు అభిషేకాలు నిర్వహించారు. శుభానం దదేవి ఆలయం, సరస్వతీ అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సోమవారం కావడంతో లక్ష పత్రి పూజలు, ఉసిరిక చెట్టు కింద లక్ష వత్తులు వెలిగించడం, లక్ష దీపారాదాన, బ్రాహ్మణులకు దాన ధర్మాలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించుకున్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆంధ్ర, తెలంగాణలోని భక్తులు చీకట్లోనే స్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు.

రాజన్న గుడిలో ఎమ్మెల్సీ పూజలు

వర్ధన్నపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇల్లంద గ్రామంలో గల శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిపోయాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లక్ష్మి దంపతులు రాజన్న గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు స్పష్టం చేశారు.


శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ సారయ్య దంపతులు

ఆలయాల్లో కార్తీక సోమవారం సందడి..


మల్హర్ : శివుడికి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


ఆకాశదీపాన్ని ఆరోహణం చేస్తున్న అర్చకులు


జడ్జి కుటుంబసభ్యులను ఆహ్వానిస్తున్న అర్చకులు

వెంకటాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివాలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసంలో తొలి సోమవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే మహిళలు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ ఉసిరిచెట్టు, రావిచెట్టు వద్ద దీపాలను వెలిగించారు.

● కాటారం :మండలంలోని ధన్వాడ శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆకాశదీపారోహణం కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని అర్చకులు కృష్ణమోహన్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, సుమిత్ సోమవారం కాశీకేదారేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయం ఎదుట ధ్వజస్థంబానికి ఆకాశ దీపారోహణం గావించారు.

● మల్హర్ : కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని మల్లారంలోని హనుమాన్ సహిత శివపంచాయతన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్ శర్మ శివునికి లఘున్యాస పూర్వక పంచామృత అభిషేకం, బిల్వ దళాలతో అర్చన కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● మంగపేట : కార్తీకమాసం ఉత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో గల దేవాలయాలల్లో అత్యంత వైభవంగా భక్తులు, ఆలయాల కమిటీలు నిర్వహించుకుంటున్నారు. కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా శివ భక్తులు, మహిళలు దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలను ఉదయాన్నే చేశారు. ముందుగా పవిత్రమైన గోదావరిలో కమలాపురం బిల్ట్ ఇంటెక్వెల్, మంగపేట, చుంచుపల్లి, పాలాయిగూడెం, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి-మల్లారం గోదావరి తీరంలో పుణ్య స్నానాలు చేసి సమీపాన గల దేవాలయాలల్లో ప్రాతఃకాలం, సాయంకాలంలో దీపాలను వెలిగించి ఉపావాస దీక్షాలను చేశారు. సాయంత్రం మంగపేట శ్రీఉమాచంద్ర శేఖరస్వామి, కమలాపురంలోని శ్రీ షీర్డీ సాయిబాబా ఆలయం, బోరునర్సాపురంలోని శ్రీసీతారా మాంజనేయాస్వామి దేవాల యంలో ఆకాశ దీపాలను అర్చకులు వెలిగించారు. భక్తులు తిలకించి పులకించి పోయారు.

హేమాచలుడిని దర్శించుకున్న నల్లగొండ జడ్జి

మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మినర్సింహస్వామిని సోమవారం నల్లగొండ జిల్లా సివిల్ కోర్టు జూనియర్ జడ్జీ శీరిష కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభస్వాగతంతో జడ్జి కుటుంబాన్ని ఆహ్వానించారు. అర్చకులు ఈశ్వర్‌చంద్‌శర్మ, మురళికృష్ణశర్మ, పవన్‌కుమారచార్యులు అందజేశారు. అర్చక ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే అసత్య ఆరోపణలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):గర్భస్థ శిశువు మృతిపై రాజకీయ కక్షతో మంత్రి శ్రీధర్‌బాబుపై పుట్ట మధు అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్ తదితరులు తీవ్ర విమర్శలు చేశారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీహెచ్‌సీలో గర్భిణీకి ప్రసూతి సేవలందించిన డెలివరీ కాకపోవడంతో 100 పడకల ఆస్పత్రికి తరలించగా ప్రసవంలో శిశువు మృతిచెందడం బాధాకరమని, కాంగ్రెస్ పక్షానా ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. మంథని ప్రాంత అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, అతడి సోదరుడు శ్రీనుబాబుపై ఎక్కడైన చిన్న సమస్య వచ్చినా అసత్య ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, నాయకు లు చీర్ల తిరుపతిరెడ్డి, అంగజాల అశోక్, భూపెల్లి రాజు, జక్కిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘు, ప్రభుదాస్, జక్కిరెడ్డి, రఘునందన్, బ్రహ్మారెడ్డి, మాధవరెడ్డి, శ్రీకాంత్, మహేష్, నరేష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ కబడ్డీ పోటీలకు ఎంపిక


కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గణపురం, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ అండర్ 14 కబడ్డీ పోటీలకు బస్వరాజుపల్లిలోని శ్రీనేతాజీ హై స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించే పోటీలకు పాఠశాల నుంచి నల్లెల సిద్ధు, అంబటి జస్వంత్, ఇజ్జిగిరి వంశీలు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఉడుత సాంబయ్య తెలిపారు. కాగా ఉమ్మడి వరంగల్ క్రీడా పోటీలో పాల్గొంటున్న విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లితండ్రులు అభినందించారు.

అవినీతికి తావులేకుండా ప్రభుత్వ పథకాలు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అవినీతి అక్రమాలకు తావు లేకుండా లబ్ధిదారులకు అందేలా పని చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 43,04988 విలువగల చెక్కుల ను 43మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అందచేశారు. తహసీల్దార్ శ్వేతారావు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, రాష్ట్ర నాయకులు సంపత్‌రావు, నాయకులు పున్నం రవి, నాంసాని రాంబాబు, ముడతనపల్లి శంకరయ్య , మటిక సంతోష్, ఎడ్ల మల్లారెడ్డి పాల్గొన్నారు.

● చిట్యాల : మండల పరిషత్ కార్యాలయంలో 49మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే జీఎస్ఆర్ కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సీఆర్‌పల్లి శివారు ఆంజనేయ కాటన్ ఇండస్ట్రీలో సీసీఐ కొనుగోళ్లను ప్రారంభించారు. కైలాపూర్ శివారు శ్రీబాల మురుగన్ కాటన్ మిల్లును ప్రారంభించి, సీసీఐ కొనుగోళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో చిట్యాల, భూపాలపల్లి ఏఎంసీ చైర్మన్‌లు గుమ్మడి శ్రీదేవీసత్యనారాయణ, గుంటోజు కిష్టయ్య, సత్యనారాయణరెడ్డి, మధువంశీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, తహసీల్దార్ హేమ, ఎంపీవో రామకృష్ణ, ఏఎంసీవైస్ చైర్మన్ రఫీ, మాజీ జడ్పీటీసీలు పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, దొడ్డి కిష్టయ్య, రాయకొంరు, తక్కళ్లపల్లి రాజు, బుర్ర లక్ష్మణ్, శ్రీనివాస్, గంగాదరి రవీందర్, రాజమొగిళి, పాల్గొన్నారు.

గోదావరి తీరం శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహదేవపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ తీరాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం శుభ్రం చేశారు. గోదావరి నీరు కలుషితమవుతుందని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గోదావరి తీరంలో చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. గోదావరిలో వ్యర్థాలతో కాలుష్యమవుతుందని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పమించి వెంటనే సిబ్బందితో గోదావరి వద్దకు వచ్చి వ్యర్థాలను తొలగించారు.

అంగన్‌వాడీ టీచర్ల బదిలీలు ఆపాలి

ఏటూరునాగారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం చేపడుతున్న అండన్వాడి టీచర్ల బదిలీలను వెంటనే రద్దు చేయాలని భూటారం, మానసపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. అక్రమ నియామకాలను నిరసిస్తూ చేపట్టిన అంగన్వాడి టీచర్ల బదిలీలను నిలిపివేయాలని నిరసిస్తూ ఏటూరునాగారం గ్రామపంచాయతీ పరిధిలోని భూటారంలోని అంగన్వాడి కేంద్రానికి గ్రామస్తులు తాళాలు వేశారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో మండలంలోని పప్కాపురం, భూటారం, మానసపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడి సెంటర్లకు నియమాలను తుంగలో తొక్కి గతంలో పని చేసిన అంగన్వాడీ టీచర్లకు బదులు నూతన టీచర్లను నియమించడం సరైందికాదని గ్రామస్తులు అధికారుల పనితీరుపై మండిపడ్డారు. ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ ద్వారా అర్హులైన వారిని నియమించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. కార్యక్రమంలో భూటారం, మానసపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని ఖరీదు చేయాలి

గోవిందరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రకటించిన 33రకాల సన్నధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ఖరీదు చేయాలని సీపీఎంపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పస్రాలో జిల్లా కమిటీ సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి అన్నిరకాల సన్నధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలులో ఎక్కడా తేడా వచ్చినా ఆందోళనలు చేస్తామని అన్నారు. అదేవిధంగా ఎన్నికలకుముందు ప్రతి రైతు కుటుంబానికి రుణవిముక్తి చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2లక్షల రుణమాఫీ విషయంలో దారుణంగా విఫలమైందని అన్నారు. రుణమాఫీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి 11నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీ పథకాలు, పోడుభూములకు పట్టాల పంపిణీని సక్రమంగా అమలు చేయలేకపోయిందని, కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. పార్టీ నాయకులతో నింపే ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా పనిచేయవని, కాంగ్రెస్ కమిటీలుగా మారుతాయని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అఖిలపక్ష కమిటీలను ఏర్పాటుచేసి పంచాయతీ సభల ద్వారా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. గోదావరి ప్రవహిస్తున్న ములుగు నియోజకవర్గంలో ఒక్క గ్రామంలోని ఏఒక్క చెరువు కూడా గోదావరి జలాలతో నిండకపోవడం ఆశ్చర్యకరమని, ఇప్పటివరకు లక్నవరం సరస్సులోకి గోదావరి జలాలు రాలేదని, ఇచ్చిన మాటను మంత్రి నిలబెట్టుకోవాలన్నారు. సమగ్ర కుటుంబ కులగణన సర్వే పారదర్శకంగా ఉండాలని తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, గ్యానం వాసు, కొప్పుల రఘుపతి, చిట్టిబాబు, తీగల ఆగిరెడ్డి, ఎమ్డీ.దావూద్, కుమ్మరి శ్రీను, గొంది రాజేష్, గఫూర్‌పాషా, చిరంజీవి, సోమ మల్లారెడ్డి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

భూపాలపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని 7వ వార్డులో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి హాజరై ప్రారంభించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఏబీసీ జిల్లా అధ్యక్షుడు జగ్గయ్య, రాష్ట్ర ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబశివరావు కంబాల రాజయ్యలు సభ్యత్వ నమోదు చేపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాంపల్లి కుమార్, చెక్క శంకర్, దుప్పటి భద్రయ్య, ప్రణయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

వెంకటాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు సోమవారం సందర్శించారు. ముందుగా ఆయన పీహెచ్‌సీలోని వార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి అంకితభావంతో వైద్యసేవలందించాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు కృషి చేయాలని, టీబీ నియంత్రణ కార్యక్రమంలో తెమడ పరీక్షలు, కేసుల నమోదు, కేసుల ఆన్‌లైన్, తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలి


అధ్యాపకులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటస్వామి

ములుగు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపించాలని మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొలిపాక వెంకటస్వామి ఉపాధ్యాయులను కోరారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలోని హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఆయన పర్యటించి ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థించారు. తనను ఎమ్మెల్సీగా గెలిపించినట్లయితే పాత పెన్షన్ సాధనే ధ్యేయంగా పనిచేస్తానని, ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యుల సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు, సందేహాల నివృత్తికి 8341341108 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈకార్యక్రమంలో టీజీవో బాధ్యులు కందుల జీవంకుమార్, హమీద్, నరేందర్, సారంగపాణి, కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత, తదితరులు పాల్గొన్నారు.

పుట్ట మధు మాటలు అర్థరహితం..

భూపాలపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు పుట్ట మధు మాటలు అర్థరహితమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు అండగా నిలబడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం భవనాల మంజూరుకు పాల్పడితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధాంతరంగా ఆగిన పనులను పూర్తి చేయడమే కాకుండా మెడికల్ కాలేజీలో ఖాళీల భర్తీ చేసి, జిల్లా జనరల్ ఆసుపత్రిలో 200లకు పైగా సిబ్బందిని నియమించడం జరిగిందని అన్నారు. ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శమని అన్నారు. భూపాలపల్లిలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మంథని నియోజకవర్గంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తూచా తప్పకుండా సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా పేద కుటుంబాలకు అండగా ఉండి విద్య, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు బుర్ర కొంరయ్య, దేవన్, అప్పం కిషన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగపేట, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేకంగా మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) నిధులను మంజూరు చేస్తుందని, ఆ ప్రత్యేక నిధులను లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య లబ్ధిదారులకు సోమవారం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్యఅతిధిగా యానయ్య హాజరై లబ్ధిదారులకు చెక్కులను అంధజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు, మంగపేట సహకార సంఘం డైరెక్టర్ కోడం బాలకృష్ణ, కాంగ్రెస్ జిల్లా అనబంధ సంఘాల బాధ్యులు హిదయతుల్లా, ముత్తినేని ఆదినారాయణ, చాద మల్లయ్య, మండల బాధ్యులు సయ్యద్ హుస్సేన్, బోడ జయరాజ్, పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు .

మాజీ సర్పంచుల అరెస్ట్


పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులను అరెస్ట్ చేసిన పోలీసులు

ఏటూరునాగారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం చలో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పెద్దమ్మ తల్లి గుడ్డి వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచులను ఎస్సై తాజుద్దీన్ అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు ఈసం రామ్మూర్తి, జిట్ట సమత, దొడ్డ కృష్ణ, అనుముల శకుంతల, చింత రేణుక, గార రమాదేవి తదితరులు ఉన్నారు.

● టేకుమట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ తాజా సర్పంచ్‌లను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కమిటీ సోమవారం హైదరాబాద్‌లో ధర్నా కార్యాక్రమం చేపట్టారు. కాగా ధర్నా కార్యాక్రమానికి వెళ్లకుండా మాజీ సర్పంచ్‌లను సోమవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కాగా మాజీ సర్పంచ్ల ఫోరం మండల కోశాధికారి ఉద్దమారి మహేష్ మాట్లాడారు. ఆరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు పండుగ శ్రీను, ఉమేందర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ములుగు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని బండారుపల్లి, జంగాలపల్లి, బరిగలపల్లి, ఇంచర్ల, నిమ్మనగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్‌లు బొక్క సత్తిరెడ్డి, చిక్కుల రాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటాల్ సన్నవడ్లకు రూ.500ల బోనస్‌ను ప్రకటించిందని, నిర్ణీత తేమతో ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి ప్రయోజనం పొందాలని రైతులను కోరారు. కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వాకిటి రామకృష్ణారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మర్రి రాజు, మాజీ సర్పంచ్ అమర్‌సింగ్, నాయకులు సమ్మిరెడ్డి, ముస్సిపల్లి కుమార్, నల్లెల భరత్‌కుమార్, జక్కుల రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపురం సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పేడువీరాపురం, ఆలుబాక, సూరవీడు, వెంకటాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, రైతులు అట్టం సత్యనారాయణ, తోట శ్రీను, విజయ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వాజేడు సొసైటీ చైర్మన్ అంజయ్య పేరూరులో రిబ్బన్ కట్ చేసి కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. మండల వ్యాప్తంగా మొత్తం 10 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా ప్రగళ్లపల్లి, చెరుకూరు, ఘనపురం, శ్రీరాంనగర్, కడేకల్, ధర్మవరం, పూసూరు, ఏడ్జర్లపల్లి, వాజేడులలో ఈ కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజయ్య మా ట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యంను విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. క్వింటా ఏ గ్రేడ్ రకంకు రూ 2320లు, కామన్ రకానికి రూ 2300, సన్న ధాన్యంకు రూ 500 బోనస్ చెల్లిస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగి ంచుకోవాలన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ వత్సవాయి జగన్నాధరాజు, సీఈవో సత్యనారాయణ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


పేరూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంజయ్య

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

గోవిందరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొత్తికోయలు గూడాల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని పస్రా ఎస్సై కమలాకర్ సూచించారు. మండలంలోని పందిరిదోన గొత్తికోయగుంపు ఆదివాసీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మావోయిస్టులు, అపరిచిత వ్యక్తులు గూడెంలోకి వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

రెండో విడత పాఠ్య పుస్తకాలు రాక

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రానికి రెండో విడతగా పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ప్రభుత్వం నూతనంగా పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మీడియంను ప్రవేశపెట్టడంతో తెలుగు, ఇంగ్లీష్‌లో ఉన్న పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జూన్ నెలలోనే మొదటి విడతగా పార్ట్-1 పాఠ్యపుస్తకాలు రాగా ప్రస్తుతం పార్ట్-2 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఆర్‌సీ సిబ్బంది తెలిపారు. ఎంఆర్‌సీకి 3,954 పుస్తకాలు రాగా మంగళవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ములుగు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో తప్పిపోయిన ఓ బాలున్ని పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మంగపేటకు చెందిన అట్టం తిరుమల-రాకేష్ దంపతులకు కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా ఈ కుటుంబం ములుగులో నివాసముంటోంది. కూతురికి జ్వరం రావడంతో తిరుమల సోమవారం ఉదయం పిల్లలను వెంట బెట్టుకొని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వెళ్లింది. తల్లిని అనుసరిస్తూ కొంతదూరం వచ్చిన హర్షవర్ధన్ దారి మధ్యలో తప్పిపోయాడు. ఒంటరిగా ఏడుస్తున్న బాలున్ని గుర్తించి చేరదీ సిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు, కానిస్టేబుల్ రజనీకాంత్ అక్కడకు చేరు కొని బాలుడి వివరాలను ఆరా తీస్తుండగానే తప్పిపోయిన తమ కొడుకు కోసం తల్లిదండ్రులు అటుగావచ్చారు. చిన్నారిని వారికి అప్పగించిన ఎస్సై పిల్లలపట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ములుగు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జగ్గన్నపేట ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ అజ్మీరా రాజు తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన అండర్-14,17 వాలీబాల్ పోటీల్లో ఎ.సంజన (ప్రథమ), ఇ.స్వాతి(ప్రథమ), అండర్-14 షాట్‌పుట్‌లో జె.ప్రవళి క(ప్రథ మ), అండర్-14 100మీటర్ల పరుగుపందెంలో ఎన్.శాలిని (ద్వితీయ), అండర్-14 ఖో-ఖోలో కె.లక్ష్మిభవాని(ద్వితీయ), అండర్-14 ఆర్చరీలో ఎం.సంజన(ద్వితీయ)స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. ఈనెల 5నుంచి 8వతేదీ వరకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జరిగే క్రీడల్లో విద్యార్థినిలు పాల్గొంటారని పేర్కొన్నారు.

అడవి జంతువుల నుంచి పంటలను కాపాడాలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరిపట్నం, పత్తిపల్లి, పొట్లాపూర్, జగ్గన్నపేట, తదితర గ్రామాల్లో రైతులు పండిస్తున్న పంటలను అటవీ జంతువుల నుంచి కాపాడాలని కోరుతూ బీఆర్ఎస్ జిల్లా నాయకులు పోరిక గోవింద్‌నాయక్, పాలెపు శ్రీనివాస్‌లు సోమవారం ములుగు అటవీశాఖ రేంజర్ డోలి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందిం చాలని వారు కోరారు.

ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని కాటారం-మంథని ప్రధాన రహదారి పై ఫోర్ లేన్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కాటారం -పెద్దపల్లి రహదారిని జాతీయ రహదారిగా మార్చడానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా ఇంకా మంజూరు కాలేదు. కాగా రాష్ట్ర ఐటీ పరిశ్రమశాఖ మంత్రి చొరవతో అధికారులు రహదారి విస్తరణ పనుల కోసం మంజూరు చేసిన నిధులతోనే ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టారు. సెంట్రల్ డివైడర్‌తో ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం జరిగేలా విస్తరణ పనులు జరుగుతున్నాయి. తదుపరి రెండో విడతలో ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేయడంతో ఫోర్ లేన్‌తో హైవేను పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

పొలంబాటలో విద్యుత్ అధికారులు

మేడారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా సమస్యలు పరిష్కరించేందుకుఎస్పీడీసీఎల్ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో తాడ్వాయి మండలం ఊరట్టం గ్రామ పంచాయతీ పరిధిలోని జంపంగవాయి, కొత్తూరు గ్రామాల్లో రైతులతో కలిసి ఏఈ రమేష్, విద్యుత్ శాఖ సిబ్బంది ప్రత్యేకంగా సమస్యను తెలుసుకొని కెపాసిటర్లతో నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయవచ్చునని వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు. ఎస్ఎల్ఐ వెంకటేశ్వరావు, ఎల్ఐ కమలాకర్, ఎల్ఎం శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కొత్తపల్లిగోరి మండల కమిటీ ఎన్నిక

రేగొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కొత్తపల్లిగోరి మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కమిటీని ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. . బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా ఎంఏ.హమీద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కానుగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కాశెట్టి మోహన్‌రావు, రేగుల మహేందర్, జూపాక దాసు, కూనూరు సదానందం, ప్రధాన కార్యదర్శులుగా దండెబోయిన సంతోష్, తిప్పారపు శ్రీనివాస్, జూపాక భాస్కర్, కార్యదర్శులుగా ఒన్నాల శంకర్, మార్క కమలాకర్, కోశాధికారిగా మేకల సాంబయ్య, యూత్ అధ్యక్షుడిగా పకిడె కిరణ్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎస్టీ గురుకులంలో ఎల్ఈడీ టీవీ చోరీ

కాటారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో గురుకుల ప్రిన్సిపాల్ లాల్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి విద్యాలయం వెనకాల వైపు నుంచి వచ్చి గది తాళం పగులకొట్టి సామ్‌సంగ్ 52ఇంచుల ఎల్ఈడీ టీవీని ఎత్తుకెళ్లారు. సోమవారం సిబ్బంది చూసేసరికి టీవీ కనిపించకపోవడంతో వైస్ ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ టీవీ ఉండే గదిని పరిశీలించి సెలవు రోజున దొంగలు వెనకాల నుంచి వచ్చి ఎత్తుకెళ్లినట్లు తెలుసుకుని రూ.66వేల విలువైన టీవీ చోరీ అయిందని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

కోటగుళ్లలో అడిషనల్ కలెక్టర్ పూజలు

గణపురం, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): కాకతీయుల కట్టడమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిరక్షణ కమిటీ అడిషనల్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి

రామగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి చిట్యాల సమ్మయ్య(45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం చిట్యాలకు చెందిన సమ్మయ్య కొయ్యూరు నుంచి నాగెపల్లి కి తన బంధువుల ఇంటి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామగిరి మండలం నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమ్మయ్య భార్య చిట్యాల సుగుణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

తాడిచర్ల ఓసీపీని తనిఖీ చేసిన అధికారులు

మల్హర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆధ్వర్యంలో స్టార్ రేటింగ్ తనిఖీ బృంధం అధికారులు సోమవారం తాడిచర్ల ఓసీపీని తనిఖీ చేశారు. అధికారులు ఓఎస్‌డీ డి వి సుబ్రహ్మణ్యం, సీసీఓ బిలాస్పూర్ ఆవినాష్ శుక్ల, నిట్ వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్ అజయ్ పటేల్, జనరల్ మేనేజర్ సేఫ్టి రఘుకుమార్, జనరల్ మేనేజర్ మైన్స్ టీజీ జెన్ కో మోహన్ రావుల మైన్స్‌లో ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు, ఎన్విరాన్మెంట్‌లో ఇతర విభాగాలను తనిఖీ చేశారు.